

అవినీతి.. ఘనాపాటి...!




ఆయన అవినీతిలో ఘనాపాటి.. అందినకాడికి దోచుకోవడంలో మహా మేటి. వీఆర్వోనే అయినప్పటికీ తహసీల్దార్లనే శాసించే స్థాయికి ఎదిగాడు. కల్లూరు మండలంలో పని చేసే ఈ వీఆర్వో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. లంచం ఇస్తే చాలు భూ సంతర్పణ చేసేస్తాడు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల అండదండలతో ఆయన సాగించిన దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వీఆర్‌ఏ (గ్రామ సహాయకుడు) నుంచి పదోన్నతి పొందిన అతను వైసీపీ నాయకులు ఏ ఫైలు తీసుకెళ్లినా జీహుజూర్ అంటూ సంతకాలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నాడని చెప్పడానికి ఆయన కట్టించిన భవంతే నిదర్శనం. గతంలో అక్కడ పని చేసిన తహసీల్దార్లతో కలిసి భూ భాగోతం సాగించి, భారీగా ఆస్తులు కూడబెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్లూరు మండల రెవెన్యూ కార్యాలయంలో ఈ వీఆర్వో అక్రమార్జనను కథలుగా చెప్పుకుంటున్నారు. దీన్నిబట్టి అతను ఏ స్థాయిలో సంపాదించిందీ అర్థం చేసుకోవచ్చు. ఆయన వల్ల నష్టపోయిన వారు ఏసీబీకే ఫిర్యాదు చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- రూ.కోట్లకు పడగలెత్తిన కల్లూరు వీఆర్వో
- వీఆర్‌ఏ నుంచి తహసీల్దార్లనే శాసించే స్థాయికి..
- వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూ సంతర్పణ
- ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి వసూలు
- ఆదాయానికి మించి ఆస్తులు
- ఏసీబీకి ఫిర్యాదు చేసిన బాధితులు

'కబ్జాల నేత'తో కలిసి అవినీతి మేత

కర్నూలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో చాలా మంది వీఆర్‌ఓలు ఉన్నారు. వారిలో ఓ వీఆర్‌ఓ అంటే ప్రజలే కాదు.. రెవెన్యూ అధికారులకు సైతం హడల్. ఆయన ఏ ఫైల్ తీసుకెళ్లినా ఇట్టే సంతకాలు చేసేవారు. అందులో ఆ అధికారుల వాటా ఎంతో వారికే ఎరుక. అయితే.. ఆ వీఆర్‌ఓకు రాజకీయ పలుకుబడితోపాటు గత వైసీపీ ప్రభుత్వంలో పాణ్యం నియోజకవర్గం, కర్నూలు నగరపాలక సంస్థనే శాసించిన ఓ కీలక ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో సదరు తహసీల్దారు 'నాకెవరు అడ్డు' అంటూ పెట్రేగిపోయినట్లు కల్లూరు మండల రెవెన్యూ కార్యాలయంలోనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. గ్రామ రెవెన్యూ సహాయకుడు (గతంలో తలారిగా పిలిచేవారు) ఉన్న ఆయన 2008లో వీఆర్‌ఓ (గ్రామ రెవెన్యూ అధికారి)గా పదోన్నతి పొందాడు. గతంలో కర్నూలు మండలంలో పని చేసిన అతను రాజకీయ నాయకుల సిఫారసుతో కల్లూరు మండలానికి బదిలీపై వచ్చాడు. జిల్లాలో కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచిన ఓ ప్రజాప్రతినిధి అండతో ఇష్టారీతిన భూముల మార్పిడి చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. కల్లూరు ప్రాంతంలో ఎక్కడ ప్రభుత్వం భూములు కనిపించినా ఈ గ్రామ అధికారి కన్ను పడుతుంది. వైసీపీ నాయకులను ఆ భూముల్లోకి దింపడం.. రెవెన్యూ అధికారుల అండతో పట్టాలు సృష్టించడం ఆయన పని. ఆ తరువాత ఒక్కో పట్టాకు ఒక్కో రేటు చొప్పున అక్రమంగా వసులు చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తన పరిధిలోకి వచ్చే రెవెన్యూ విధులే కాకుండా ఇతర వీఆర్‌ఓల పరిధిలోకి కూడా వెళ్లి చక్కబెట్టేవారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక గ్రామ స్థాయి రెవెన్యూ అధికారి బడాబాబులు ఉండే కాలనీలో రూ.3 కోట్లకు పైగా విలువ చేసే 11 సెంట్లలో మూడు అంతస్తుల విలాసవంతమైన భవంతి (ఇల్లు) నిర్మించుకున్నాడంటే ఆ వీఆర్‌ఓ అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు.



కల్లూరు తహసీల్దార్ కార్యాలయం

అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ ఆ వీఆర్వో?



కల్లూరు మండలంలో రాజకీయ నాయకుల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆ వీఆర్‌ఓ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దారుల సహకారంతో చేయని అక్రమాలు లేవంటూ అదే శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. ఆ తహసీల్దార్లు బదిలీపై వెళ్లినా.. ప్రభుత్వ భూములకు పట్టాలు సృష్టించి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లతో సంతకాలు చేయించాడని తెలుస్తోంది. ఇలా ఒక్కో పట్టాకు ఒక్కో రేటు నిర్ణయించి అమ్ముకున్నాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దాదాపుగా 250-300లకు పైగా ఇంటి పట్టాలు సృష్టించి ఒక్కో పట్టాకు రూ.25-30 లక్షలకు పైగా వసులు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వక్కేరు వాగు ఆనుకొని ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన దాదాపు 4 ఎకరాలు ఆన్‌లైన్‌లో ఓ రియల్ ఎస్టేట్ పేరున మార్చినట్లు సమాచారం. ఆ భూమి విలువ రూ.4 కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఈ భాగతంలో కీలకంగా వ్యవహరించిన సదరు వీఆర్‌ఓకు భారీ మొత్తంలో డబ్బు చేరిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ భూమిలో వెంచర్ వేసి ఇంటి పట్టాలు విక్రయాలు చేస్తున్నారు. పెద్దపాడు సమీపంలో రాజీవ్ గృహకల్ప వెనుకాల ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు చెందిన కేబీసీ కాలువకు చెందిన దాదాపు ఎకరం భూమి ఆన్‌లైన్‌లో పేరు మార్చడమే కాకుండా ఏకంగా పట్టాదారు పాస్‌పుస్తం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భూమి విలువ అక్షరాల రూ.25 కోట్ల పైమాటే అని అంటున్నారు. ఈ పని చేసిపెట్టినందుకు సదరు వీఆర్‌ఓకి ఏ స్థాయిలో మామూళ్లు ముట్టి ఉంటాయో ఇట్టే తెలుస్తుందని పలువురు చర్చించుకోవడం కొసమెరుపు. వాగు పోరంబోకు భూమి రెండు ఎకరాలకు బోగస్ రికార్డులు సృష్టించి ఓ కార్పొరేటర్‌కు ధారాదత్తం చేశారని, వక్కెర వాగు పక్కనే ఉన్న 80 సెంట్లు వారు పోరంబోకు భూమిని గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు పట్టాలు ఇచ్చినట్టు తెలిసింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు, గత ప్రభుత్వంలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో వంక పోరంబోకు, వక్ఫ్‌బోర్డు, కాలువ భూములను పట్టాల పేరిట అన్యాక్రాంతం చేసి రూ.కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

ఏసీబీకి ఫిర్యాదు

కల్లూరు మండలంలో ఆదాయానికి మించి అక్రమార్జనలో దిట్టగా పేరుగాంచిన సదరు వీఆర్‌ఓ అవినీతి అక్రమాలపై విచారించిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ వీఆర్‌ఓ బాధితుల పేరిట కర్నూలు ఏసీబీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఎక్కడెక్కడ అక్రమంగా పట్టాలు తీసుకున్నాడు, రూ.కోట్ల విలువ చేసే భవంతి వివరాలు, ప్రభుత్వ భూములు ఎవరెవరి పేరట మార్చాడో సర్వే నంబర్లు సహా పక్కా వివరాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సమగ్రంగా విచారిస్తే ఓ వీఆర్‌ఓ సాగించిన భారీ అవినీతి భాగోతం వెలుగులోకి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

చిన్నహ్యోట సచివాలయానికి తాళం

- పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం



సచివాలయానికి తాళం వేస్తున్న గ్రామస్థులు

హొళగుంద, జూలై 9: ప్రభుత్వం మారినా సచివాలయం సిబ్బంది పని తీరు మారడం లేదు. సచివాలయాలకు సమయానికి అనుగుణంగా హాజరై ప్రజల సమస్యలు తీర్చాల్సిన సిబ్బంది, అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా హొళగుంద మండలంలోని చిన్నహ్యోట గ్రామ సచివాలయ కార్యాలయానికి గ్రామస్థులు తాళం వేసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చిన్నహ్యోట సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్థులు గోవిందరాజు, వీరేష్, ఈరన్న, రాజు, శేషగిరి, రామకృష్ణ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయితీ కార్యదర్శికి చెప్పుకుందామంటే సచివాలయానికి రావడం లేదన్నారు. ఎస్సీ కాలనీలో కొన్ని నెలలుగా వీధి లైట్లు లేక చీకటిలో మగ్గుతునట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వారాలకోసారి తాగునీరు సరఫరా అవుతోందన్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్డుపై మురుగు పారుతోందని వాపోయారు. ఎన్నో సమస్యలను చెప్పుకుందామని వస్తే అధికారులు మాత్రం ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్‌ను వివరణ కోరగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత సచివాలయం సిబ్బందిపై విచారణ జరిపి, షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

నగర సమగ్రాభివృద్ధికి చర్యలు


రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ● మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: కర్నూలు నగర సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖల మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో నగర పాలక సంస్థ అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ నగరాభివృద్ధికి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, వాటి స్థితిగతులను మంత్రికి వివరించారు. గత నెల 15న నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాల అమలుపై మంత్రి ఆరా తీశారు. అమృత్-2 పథకానికి సంబంధించి మంజూరై నిలిచిపోయిన పనుల గురించి మాట్లాడారు. జగన్నాథగట్టు మీద రూ.130 కోట్లతో 50 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం, అలాగే 21 ఈఎస్ఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణం, తుంగభద్ర నది ఒడ్డున రూ.122 కోట్లతో 35 ఎంఎల్‌డి మురుగు నీటి శుద్ధి కేంద్ర నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు వద్ద ఎస్ఏపీ క్యాంపు నుంచి బస్టాండ్ సమీపంలో ప్రవేశించేలా రూపొందించిన 60 అడుగుల రోడ్డు విషయమై 2వ పటాలం పోలీస్ అధికారులతో మాట్లాడాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ చంద్రమౌళి, నగర పాలక సంస్థ ఎస్ఈ డి.వేణుగోపాల్, ఎంఈలు షాకీర్, శేషసాయి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఇంచార్జి సీపీ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు, సెక్రటరీ నాగరాజు, డీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

ఏపీఐఐసీ దరఖాస్తులను పరిష్కరించండి



కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 9: ఏపీఐఐసీకి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములకు సంబంధించి మార్ట్‌గేజ్ చేసే ప్రక్రియపై రాష్ట్ర స్థాయి నుంచి ఉత్తర్వులు రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ జెడ్ఎంను ఆదేశించారు. త్వరలో తాను ఏపీఐఐసీ పరిశ్రమలు, భూములను విజిట్ చేస్తానని తెలిపారు. సింగిల్ డెస్క్, పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి అర్హులైన వారికి అనుమతులు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఓర్వకల్లు తహసీల్దార్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములకు సరైన పరిహారం చెల్లిస్తాం : జేసీ మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), జూలై 9: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రాజెక్టు 765 కేవీ కర్నూలు-3 పవర్‌లైన్‌ల నిమిత్తం రైతుల నుంచి సేకరించే భూములకు సరైన పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఓర్వకల్లు మండలానికి చెందిన రైతులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ టవర్లు, పవర్ లైన్లు ఏర్పాటు చేయడానికి కార్పొరేషన్ అవసరాల నిమిత్తం రైతుల భూములు సేకరించాల్సి వస్తుందన్నారు. ఒక టవర్ ఏర్పాటు కోసం దాదాపు 7 సెంట్లు, ఇతర అవసరాలకు అర ఎకరా అవసరం అవుతుందన్నారు. ఇందుకోసం రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్‌కే చౌహాన్, డీజీఎం జి.నాగరాజు, ఆర్డీవో శేషిరెడ్డి పాల్గొన్నారు.



'ధరలు తగ్గించి విక్రయించాలి'

రైతుబజార్లు, సూపర్ బజార్లలో బియ్యం, కందిపప్పు ధరలను తగ్గించి ప్రజలకు విక్రయించాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లైస్ అధికారులు, సూపర్‌బజార్ వ్యాపారులు, రైస్‌మిల్లు వ్యాపారులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేజీ మాట్లాడుతూ కందిపప్పు కేజీ రూ.160, సోనామసూరి స్టీమ్ రైస్ కిలో రూ.49, సోనామసూరి రా రైస్ కిలో రూ.48 చొప్పున విక్రయించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కేవీఎస్ఎన్ ప్రసాద్, షర్మిల, ఏఎస్‌వోలు రామాంజనేయ రెడ్డి, శివరంజని, డిప్యూటీ తహసీల్దార్ సహేరాబాను, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

పాట ముగిసినా ఆగని వేట

పట్టిన చేపలు ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం



- పందికోన రిజర్వాయర్‌లో జోరుగా చేపల వేట
- నిషేధాజ్ఞలు ఉన్నా రాత్రి పగలు కొనసాగుతున్న వైనం
- అధికారం మారినా ఆగని వైసీపీ నాయకుల దందాలు

పత్తికొండ, జూలై 9: గడువు ముగిసినా, మత్స్య శాఖ నిషేధాజ్ఞలు ఉన్నా కొందరు అక్రమార్కులు ఐదు రోజులుగా చేపల వేట సాగిస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే చేపలను వేరే ప్రాంతాలకు ఎగుమతి చేసుకొని అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పత్తికొండ సమీపంలోని పందికోన రిజర్వాయర్‌లో ఇంతటి తతంగం జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ముగిసిన గడువు

పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకం కోసం వేసే వేలాల్లో బయటి వ్యక్తులు పాల్గొనకుండా వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడి తక్కువ ధరకు టెండర్ దక్కించుకుంటున్నారు. గత ఏడాది రూ.3.13,211కు వైసీపీ నాయకులు టెండర్‌ను దక్కించుకుని చేపల పెంపకం, అమ్మకం చేపట్టారు. జూన్ 30కి ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసింది. జూలై, ఆగస్టు నెలలు చేపలు సంతానోత్పత్తి చేసే సమయం కావడంతో తిరిగి సెప్టెంబరు నుంచి జూన్ 30 వరకు చేపల పెంపకం అమ్మకానికి సంబంధించి మత్స్యశాఖ వేలాలను నిర్వహిస్తారు.

నిషేధాజ్ఞలు ఉల్లంగిస్తూ చేపల వేట..

పత్తికొండ మత్స్యశాఖ అధికారులు పందికోన రిజర్వాయర్‌లో జూలై, ఆగస్టు నెలల్లో చేపలవేట జరపరాదని నిషేధాజ్ఞలను జారీ చేశారు. పందికోన, పులికొండ గ్రామ పంచాయతీకి సంబంధిత శాఖ నుంచి నోటీసులు జారీ చేశారు. గ్రామాల్లో డప్పు వేసి చేపల వేట చేయరాదని ప్రకటనలు చేశారు. అయితే ఈ నిబంధనలు తమకు కాదన్నట్లు గత ఏడాది చేపల పెంపకం హక్కులు పొందిన వైసీపీ నాయకులు తమ గడువు ముగిసినా, నిషేధాజ్ఞలు ఉన్నా ఐదు రోజులుగా పదుల సంఖ్యలో బోట్ల ద్వారా రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు కొందరు ఆరోపిస్తున్నారు.

ఏటా కోటికి పైగా ఆదాయం..

సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రిజర్వాయర్‌లో చేపల పెంపకం వేలం పాటల్లో తక్కువ ధరకు పాటపాడుకుంటున్న స్థానిక నాయకులు ఏటా కోటికిపైగా చేపల ఎగుమతుల ద్వారా ఆదాయం పొందుతున్నట్లు సమాచారం. ఇంత పెద్ద జలాశయంలో చేపల పెంపకానికి రూ.3లక్షలకే పాటపాడుకుంటూ కోట్లు సంపాదించుకుంటూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పందికోన రిజర్వాయర్‌లో బోట ద్వారా చేపలవేట సాగిస్తున్న దృశ్యం



నిషేధాజ్ఞలు జారీ చేశాం

పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకం, అమ్మకాలకు సంబంధించి గతేడాది నిర్వహించిన వేలంపాటల గడువు జూన్ 30తో ముగిసింది. అందుకు సంబంధించిన అంశంతోపాటు జూలై, ఆగస్టు నెలల్లో రిజర్వాయర్‌లో చేపల వేట సాగించరాదన్న వివరాలను చూపుతూ ఇప్పటికే మండల కార్యాలయాలకు, గ్రామపంచాయతీలకు, స్థానిక మత్స్యశాఖ అధికారులకు నోటీసులు పంపాం. నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట సాగిస్తే చర్యలుతప్పవు.

\- బాలరాజు, మత్స్యశాఖ అధికారి



బాక్స్‌లలో రవాణాకు సిద్ధంగా ఉన్న చేపలు

ఈ కాలువల్లో నీరు పారుతుందా?

● గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం ● దృష్టి సారించిన టీడీపీ ప్రభుత్వం
● తాత్కాలిక పనులకు రూ.19.29 కోట్లు కావాలి


కౌతాళం మండలం రౌడూరుకు సాగు నీరు అందించే ఎల్లెల్సీ దుస్థితి ఇది




కేసీ కాలువ దుస్థితి


గాజులదిన్నె ప్రాజెక్టు ఆయకట్టు దిగువన ఎడమ కాలువ దుస్థితి

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పంట కాలువలను మరమ్మతు చేయాలి. ఆయకట్టుకు రైతులకు సాగునీరు అందేలా చూడాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. అయితే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. రైతులకు అత్యంత ముఖ్యమైన పంట కాల్వలను కనీసంగా పట్టించుకోలేదు. ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వలేదు. ఇటీవల కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం పంట కాలువల మరమ్మతులపై దృష్టి సారించింది. తక్షణ మరమ్మతుల కోసం ఎన్ని నిధులు కావాలో జలవనరుల శాఖ సీఈవోల నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాష్ట్రంలో ప్రాజెక్టులు, కాలువపై తాజా పరిస్థితిని సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు నీరు ఇవ్వాలని దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాజెక్టులు, పంట కాలువ పరిధిలో తక్షణ మరమ్మతులకు రూ.19.29 కోట్లు నిధులు అవసరమని సీఈ కబీర్‌బాషా నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), కర్నూలు-కడప (కేసీ) కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టు, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు (జీఆర్‌పీ), శ్రీశైలం జలాశయం, తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ), సిద్ధేశ్వరం లిఫ్ట్ స్కీం, ఎస్‌ఆర్‌బీసీ, గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ ఎస్ఎస్) వంటి భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా సాగునీటి వనరుల కింద సరాసరి 8 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగు నీరు ఇవ్వాల్సి ఉంది. గత జగన్ ప్రభుత్వం సాగునీటి వనరులైన పంట కాలువలు, ఎత్తిపోతల పథకాలు, ప్రాజెక్టు మరమ్మతులపై అంతులేని నిర్లక్ష్యం చూపారు. ఫలితంగా పలు కాలువలు అధ్వానంగా మారాయి. పూడిక, ముళ్ల కంపలతో నిండిపోయాయి. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలకు ప్రధాన జీవనాడి అయిన కేసీ కాలువ కర్నూలు సమీపంలోనే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కర్నూలు నగరం మురుగు నీరంతా చేరి గుర్రపుడెక్క, ముళ్లకంప, రబ్బరు చెట్లు పేరుకుపోయాయి. పశ్చిమ ప్రాంతంలో ప్రాణ జలాలు అందించే తుంగభద్ర దిగువ కాలవ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు, గాజులదిన్నె ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా మారాయి. గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ ఆనకట్ట దిగువన ప్రమాదకరంగా మారింది. నంద్యాల జిల్లాలోని ఎస్‌ఆర్‌బీసీ, తెలుగుగంగ ప్రాజెక్టు కాలువలతో పాటు సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం పరిస్థితి దాదాపు ఇదే. తక్షణ మరమ్మతులకు నిధులు ఇవ్వకపోతే.. ప్రాజెక్టుల్లో వరద నీరు చేరినా చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసినా ఆ ఫలితంగా ఆయకట్టు రైతులు అనుభవించాల్సిన దైన్య పరిస్థితి ఉందని అంటున్నారు. కొన్ని మండలాల్లో రైతులే చందాలు వేసుకొని లిఫ్టులు, కాల్వలు మరమ్మతులు చేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

● రూ.19.28 కోట్లు ఇవ్వండి:

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల తాజా పరిస్థితులపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సీఈలతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఏ ఏ ప్రాజెక్టు, కాలువ తాత్కాలిక మరమ్మతులకు ఎంత నిధులు అవసరమో క్షేత్ర స్థాయి ఇంజనీర్ల ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తక్షణ మరమ్మతులకు రూ.19.28 కోట్ల నిధులు ఇవ్వాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రైతులకు కాల్వలపై కన్నీటి కష్టాలు తీరినట్లేనని అంటున్నారు. ఈ విషయాన్ని సీఈ కబీర్‌బాషా దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాజెక్టులు, కాలువలు తక్షణ మరమ్మతులకు రూ.19.28 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపిన మాట నిజమే. రైతులకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారని వివరించారు.

● ప్రాజెక్టుకు చేపట్టాల్సిన పనులు, నిధులు.. రూ.లక్షల్లో..

ప్రాజెక్టు/కాలువ	పనులు	నిధులు
కేసీ కాలువ	35	317.28
టీబీపీ ఎల్లెల్సీ	17	238.19
గాజులదిన్నె ప్రాజెక్టు	5	89.26
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	13	232.03
శ్రీశైలం ప్రాజెక్టు	4	79.14
తెలుగుగంగ ప్రాజెక్టు	42	393.78
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	12	148.59
ఎస్ఆర్‌బీసీ కాలువ	42	356.85
గాలేరు-నగరి ప్రాజెక్టు	8	73.85
మొత్తం	178	1928.97

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● అన్నమయ్య జిల్లా పీలేరు దగ్గర రోడ్డు ప్రమాదం
● మృతులు కోసిగికి చెందిన ఇద్దరు మహిళా వలస కూలీలు
● మరో నలుగురికి తీవ్ర గాయాలు



అంజినమ్మ, కౌతాళం లక్ష్మి (ఫైల్)

కోసిగి, జూలై 9: కర్నూలు జిల్లా కోసిగి మండల కేంద్రం నుంచి బతుకుదెరువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు సొంత ఊరిలో పనులు లేక పొట్ట చేతపట్టుకుని పిల్లాపాపలతో అన్నమయ్య జిల్లా పీలేరు దగ్గర సిమెంటు కూలీ పనికి రెండు నెలల క్రితం వలస వెళ్లారు. సోమవారం యథావిధిగానే పనులు ముగించుకుని రాత్రి ఆటోలో వస్తుండగా.. వెనుక వైపు నుంచి టిప్పర్ వేగంగా ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న 8 మంది ప్రయాణికుల్లో కోసిగిలోని రెండో వార్డుకు చెందిన కౌతాళం లక్ష్మి (18), 9వ వార్డుకు చెందిన ఉల్లి అంజినమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందారు. అంజినమ్మ కూతురు మల్లికకు రెండు కాళ్లు విరిగిపోయాయి. కౌతాళం లక్ష్మి అన్న నరసింహులు తలకు బలమైన గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది. అలాగే మరో బంధువైన పెద్ద తుంబళం అయ్యన్నకు తీవ్ర గాయాలయ్యాయి. అంజినమ్మ కూతురు మల్లిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటన వలస కూలీల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. కోసిగిలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన ఇద్దరు మహిళా కూలీల భౌతికకాయాలకు మంగళవారం కోసిగికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జూలై 9: కొలిమిగుండ్లలోని జమ్ములమడుగు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలుం గ్రామానికి చెందిన శేఖర్(25) మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. శేఖర్ మోటార్ సైకిల్‌పై ఉయ్యాలవాడకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న జీపు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తాడిపత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

శ్రీశైలం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

71 మంది ఉద్యోగులకు స్థాన చలనం

శ్రీశైలం, జులై 9: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం దేవస్థానంలో ప్రక్షాళన దిశగా భారీగా అంతర్గత బదిలీలు జరిగాయి. మంగళవారం 71 మంది శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఆలయ కార్య నిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ బదిలీలు దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా చేపట్టినట్టు పేర్కొన్నారు. బదిలీలలో ఏఈవో మోహన్‌ను గోశాల, గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకులు, వైద్యశాలలకు కేటాయించారు. పీఆర్‌వో టి.శ్రీనివాసరావుకు ప్రజాసంబంధాలు, మీడియా అడ్వైజర్‌లతోపాటు అదనంగా వసతి, ప్రొటోకాల్, టోల్‌గేట్, కాల్‌సెంటర్ విభాగాలను కేటాయించారు. పరిపాలనా విభాగాన్ని కె. వెంకటేశ్వరరావుకు అప్పగించగా, కె. బ్రహ్మయ్యను, బాల కార్తీక్‌గౌడ్‌ను ఈవో సీసీ బాధ్యతలు కేటాయించారు. స్థానచలనం పొందిన సిబ్బంది వెంటనే ఉత్తర్వుల ప్రకారం సదరు అధికారులకు కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఈవో పెద్దిరాజు ఆదేశించారు.

నీట్ పేపర్ లీకేజీపై స్పందించాలి

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు



రాష్ట్రపతికి పంపనున్న పోస్టుకార్డును చూపుతున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 9: నీట్ పేపరు లీకేజీపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పోస్టు ద్వారా రాష్ట్రపతికి లేఖలను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపరు లీకేజీతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని ఆరోపించారు. నీట్ పేపరు పరీక్ష లీకేజీ సూత్రధారులను శిక్షించకుండా సంబంధం లేని వ్యక్తులను అరెస్టు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. నేషనల్ టెస్టు ఏజెన్సీ పేపరు లీకేజీ చేసి అవినీతి అరాచకాలకు పాల్పడిందని ఆరోపించారు. తక్షణమే ఎన్‌టీయేను రద్దు చేయాలని రాష్ట్రపతిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, తేజ్, రాజీవ్, లక్ష్మణ్‌రావు, శివప్రసాద్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌ని అభివృద్ధి చేస్తాం

ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), జూలై 9: కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తామని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం కర్నూలు ఎంపీ మొదటిసారిగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పర్యటించారు. ముందుగా కార్డియోథొరాసిక్, ఐసీయూ, కార్డియాలజీ, డయాలసిస్ విభాగాల్లో తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్‌రెడ్డితో కర్నూలు ఎంపీ పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వలసలు అధికంగా ఉంటాయని, ఈ ప్రాంత ఆరోగ్య సంజీవని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీసుకెళ్లానన్నారు. ఆసుపత్రిలో త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి కావాల్సిన నిధులు, ఖాళీ పోస్టులపై చర్చిస్తామన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో ఆఫీసును తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్, అడిషినల్ డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌లు ఎంపీకి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టులను పెంచాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎంపీని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్, రాష్ట్ర కార్యదర్శి అబ్రహం, రాష్ట్ర ఈసీ సభ్యులు సురేష్, లోకేశ్, హరిశ్చంద్ర నాయుడులు ఎంపీని కలిశారు. కర్నూలు ఎంపీ వెంట ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


కార్డియోథొరాసిక్ ఓటీ వార్డులో పర్యటించిన ఎంపీ బస్తిపాటి

దొరకని బాలిక ఆచూకీ

డాగ్ స్క్వాడ్‌తో ఎత్తిపోతల పథకం వద్ద గాలింపు

క్షుద్రపూజల కలకలం



ముచ్చుమర్రిలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల సమీపంలో క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

పగిడ్యాల, జూలై 9: మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రి మజరా గ్రామమైన ఎల్లాలకు చెందిన వాసంతి అనే బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో మంగళవారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం గ్రామానికి చేరుకున్న నందికొట్కూరు సీఐలు విజయభాస్కర్, ప్రకాష్ కుమార్ కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి బాలిక ఇంటి వద్ద నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట వెళ్తూ సమీపంలోని ముచ్చుమర్రి ఎత్తిపోత్తల పథకం వద్దకు డాగ్ స్క్వాడ్ చేరుకుంది. ఎత్తిపోతల వద్ద ఏర్పాటు చేసిన పార్క్‌లో కొద్దిసేపు తిరిగి బయటకు వచ్చి ఎత్తిపోతల అప్రోచ్ కాల్వ వెంట ఉన్న రాళ్ళ గుట్టల వెంట సుమారు నాలుగు కిలోమీటర్లకు పైగా వెళ్లాక డాగ్ నిలబడిపోయింది. అనంతరం కాల్వ అవతలి ఒడ్డున పాత ఎల్లాల సమీపంలోని కొలమన్న అనే రైతు పొలం వద్ద క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాలు కనిపించాయి. పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. పొలంలో నిమ్మకాయలు, మట్టితో చేసిన బొమ్మ, పసుపు, కుంకుమ, కత్తిని పోలీసులు గుర్తించారు. బాలిక అదృశ్యమై రెండు రోజులు దాటిపోయినా ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పాపం వాసంతి



నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 9: వాసంతి ఆదివారం సాయంకాలం ఆడుకోడానికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాలేదు. కన్నవారికి ఆందోళన మొదలైంది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం విజయోత్సవ ర్యాలీలో ఉన్న ఎంపీ బైరెడ్డి శబరికి ఈ విషయం తెలిసింది. 24 గంటలకల్లా బాలిక ఆచూకీ కనుక్కోవాలని పోలీసులకు ఆదేశించారు. బాలికతో ముగ్గురు మైనర్లు వికృతంగా ప్రవర్తించి హత్య చేసినట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం కనిపించకుండా పోయిన పగిడ్యాల మండలం కొత్తముచ్చుమర్రి గ్రామానికి చెందిన మద్దిలేటి, సుజాతల రెండో కూతురు వాసంతి(9) పాత ముచ్చుమర్రి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం ముచ్చుమర్రి పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన వాసంతి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి డా.శబరి నందికొట్కూరు విజయోత్సవ ర్యాలీలో ఉండగా ఈ విషయం తెలిసింది. దీంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు, నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, పట్టణ సీఐ ప్రకాష్ కుమార్, ఎస్ఐలు నాగార్జున, జయశేఖర్, జగన్మోహన్, ఇతర పోలీసులు సిబ్బంది గత రెండు రోజులుగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగడంతో ఒక చోట క్షుద్రపూజలు చేసిన చోట బాలిక దుస్తులు లభ్యమైనట్లు తెలిసింది. ముగ్గురు బాలురు పార్కులో ఆడుకుంటున్న చిన్నారిని కిడ్నాప్ చేస్తామని బెదిరించి తీసుకెళ్లి వికృతంగా ప్రవర్తించి అమానుషంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటనా స్థలాన్ని చూపించినట్లు తెలుస్తోంది. బాలురు ఇచ్చిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కాలువలో వాసంతి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

● టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం అభినందనీయమని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని రూ. కోట్లల్లో సొమ్ము చేసుకోవడమే కాకుండా భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిందని మండిపడ్డారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు చాలా ఇసుక వల్ల ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుక దొరకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొని తినడానికి తిండి లేక పస్తులుండి రోడ్లపాలయ్యారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారం చేపట్టడంతో ఒక్కసారిగా అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం కల్పిస్తుందన్నారు. ఈ ఉచిత ఇసుక విధానంతో ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అవసరమైన వారు మాత్రమే ఇసుకను తీసుకెళ్లి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోట్లను నాయకులు కొల్లగొట్టారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారు, వేణు, సుధాకర్, రామగోవిందు పాల్గొన్నారు.

ఎంపీ బైరెడ్డి శబరికి శుభాకాంక్షలు



బైరెడ్డి శబరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 9: ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి వి.జవహర్, నగర అధ్యక్షులు ఎం.సి కాశన్న, నంద్యాల తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు మునిశేఖర్ రెడ్డి, హుసేన్ రెడ్డి, కోడుమూరు తాలుకా కార్యదర్శి వలి, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 9: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్య శెట్టిలు అన్నారు. మంగళవారం స్థానిక టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో నాడు-నేడు రెండో ఫేజ్ జరిగిన పనులను ఇంటర్మీడియట్ బోర్డు అధి కారులు, కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన ఎంతో మంది రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు అత్తావుర్ రహమాన్, జలగంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు వంద శాతం సబ్సిడీ

ఓర్వకల్లు, జూలై 9: పండ్ల తోటలు సాగు చేస్తే రైతులకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ అందిస్తుందని ఏపీవో కుమార సాయినాథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోపు పండ్లతోటల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదెకరాలు అంతకంటే తక్కువ భూమి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మామిడి, చీని, నన్న నిమ్మ, జామ, సపోట, సీతాఫలం, దానిమ్మ, నేరేడు వంటి పండ్ల తోటలు సాగు చేసుకుంటే మూడేళ్ల పాటు ప్రభుత్వం ద్వారా వంద శాతం సబ్సిడీ, నిర్వహణ చార్జీల కింద చెల్లిస్తామన్నారు. అలాగే రోజా, మల్లెతోటలు సాగు చేసుకునే రైతులకు రెండేళ్లు, మునగ తోటల సాగు చేసుకునే రైతులకు రెండేళ్ల పాటు నిర్వహణ చార్జీలు ఇస్తామన్నారు. ఆసక్తిగల రైతులు మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవోకు, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 9: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టంగుటూరి ప్రకాశం పంతుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, కళాకారుల సేవా కేంద్రం బైలుప్పల షఫీవుల్లా, ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులకు మీసాల సుమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు సబ్బులు, పేస్టు, బ్రష్‌లు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా జ్వరాలు సోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ ఎస్.రహీమ్ అహ్మద్, ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామ ఘటనలో దళితులపై దాడి చేసి నిందితులను అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు, రాష్ట్ర నాయకులు రంగమ్మ, కరుణాకర్‌లు దళితులకు న్యాయం చేయాలని కోరుతూ వడ్డేశ్వరం వద్ద టీడీపీ కార్యాలయంలో, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అట్రాసిటి ఎక్కుగా ఉన్న జిల్లాలో కర్నూలు జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం విడిపోయాక అది మొదటి స్థానాన్ని ఆక్రమించిందన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

కోడుమూరు(రూరల్), జూలై 9: మండలంలోని వర్కూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అచ్చిరెడ్డిగారి ఈశ్వరరెడ్డి (55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం ఇంట్లో ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈశ్వరరెడ్డి మృతి వార్త తెలిసి మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, జడ్పీటీసీ రఘునాథరెడ్డి తదితరులు చేరుకుని నివాళులు అర్పించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ నిర్మించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ నగరంలో జనాభా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు వెళ్లేం దుకు వీలులేకుండా పోయిందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని బళ్లారి చౌరస్తా నుంచి సి.క్యాంపు సెంటర్ వరకు, పాతబస్టాండు నుంచి రాజ్‌విహార్ వరకు ఫ్లైఓవర్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. నగరంలో మంచినీరు కలుషితంగా వస్తున్నాయని, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. దోమల బెడద నుంచి ప్రజలను రక్షించాలని ఆయ న కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పీ నిర్మల, కేవీ నారాయణ, నగర కార్యదర్శి టి.రాముడు. సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప పాల్గొన్నారు.

ప్రయాణికులకు వసతులు కల్పించడమే లక్ష్యం

» మంత్రి టీజీ భరత్

» కొత్తగా నాలుగు సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం

కర్నూలు(రూరల్), జూలై 9: ఏపీఎస్ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూలు కొత్తబస్టాండ్ ఆవరణలోని కర్నూలు-1డిపో గ్యారేజీలో మంగళవారం సాయంత్రం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి రెండు స్టార్‌లైనర్ బస్సులు, నాలుగు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారని వివరించారు. రెండు స్టార్ లైనర్ బస్సులతో పాటు రెండు సూపర్ లగ్జరీ బస్సులను సైతం కర్నూలు నుంచి బెంగళూరు రూట్‌లో కొనసాగుతాయన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ అంతేకాకుండా మరో రెండు సూపర్ లగ్జరీ బస్సులను తిరుపతి మార్గంలో తిరుగుతాయన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో సెలవు దినం కావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు స్వంత ఊర్లకు రావడానికి ఆర్టీసీ యాజమాన్యం అదనంగా రెండేసీ చొప్పున కొత్త బస్సులను నడపడం అభినందనీయమన్నారు. కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతు దూరప్రాంత ప్రయాణికులకు అత్యున్నత ప్రమాణాలు కలిగిన కొత్త బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు-1,2 డిపో మేనేజర్లు సర్దార్‌హుస్సేన్, సుధారాణి, డిపో అసిస్టెంట్లు మేనేజర్లు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్‌లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ, ఎంపీ నాగరాజు

మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి టీజీ భరత్

కర్నూలు(కలెక్టరేట్): మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో మైనార్టీ వెల్ఫేర్‌కు సంబంధించిన అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఆక్రమణకు గురైన మైనార్టీ భూములను గుర్తించి వాటిపై సమగ్ర నివేదికను అందజేయాలని వక్ఫ్‌బోర్డు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి సహకరించండి'

కల్లూరు, జూలై 9: కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో ప్రజల సమస్యలు పరిష్కరించి వార్డుల అభివృద్ధికి సహరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ నూతన కార్యాలయంలో కమిషనర్ భార్గవతేజతో కలిసి ఎమ్మెల్యే గౌరుచరిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లూరు అర్బన్ వార్డులలో వీధి దీపాల మరమ్మతులు, కాల్వల్లో పూడికతీత పనులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు పందులు, కుక్కల బెడద తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ. వేణుగోపాల్, ఎంఈలు షాకీర్, శేషసాయి, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునైద్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత. గౌరు దంపతులకు వేద ఆశీర్వాదం అందజేస్తున్న అర్చకులు

ఇసుక పాలసీతో పేదల సొంతింటి కల సాకారం: సీఎం నారా చంద్రబాబునాయుడు ఇసుక పాలసీపై జీవో విడుదల చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడం కోసమే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారని అన్నారు. దీంతో సామాన్య ప్రజలు, భవన నిర్మాణ కార్మికులకు పని దొరుకుతుందని అన్నారు.

గౌరు దంపతులకు వేద ఆశీర్వాదాలు

కర్నూలు(కల్చరల్): ఎమ్మెల్యే గౌరు చరిత, వెంకటరెడ్డి దంపతులకు కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదాలు అందజేశారు. మంగళవారం కర్నూలులోని గౌరు చరిత నివాసంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఆలయ పండితులు గౌరు దంపతులకు గజమాల వేసి, శాలువతో సత్కరించి, వేద ఆశీర్వాదాలు అందజేశారు. అలాగే ఆలయం నుంచి తీసుకువచ్చిన స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ప్రథమ పూజారి సురేష్‌శర్మ, కృష్ణయ్యశర్మ, ఈవో రామకృష్ణ, గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, పురుషోత్తం రెడ్డి, అన్నదాన సత్రం మేనేజర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు స్ఫూర్తిరెడ్డి

కర్నూలు(కల్చరల్), జూలై 9: నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన కంటి వైద్యురాలు స్ఫూర్తిరెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ స్ఫూర్తిరెడ్డి విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానమని, కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కంటి చూపు లేకపోతే ప్రపంచమే అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్ జోసఫ్ డేవిడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేని మందులు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఓర్వకల్లు, జూలై 9: అనుమతి లేని ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని వ్యవసాయాధికారులు హెచ్చరించారు. మంగళవారం ఓర్వకల్లులోని అన్ని రసాయనిక ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శ్రీనివాసరావు, హనుమంతరావు, కేశవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఓర్వకల్లులో కిసాన్ అగ్రిమాల్ షాపులో 37,050 బయో పెస్టిసైడ్‌కి సరైన రికార్డులు చూపకపోవడంతో ఆ స్టాక్‌ను నిలుపుదల చేశామన్నారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, ఏఈవో భాస్కర్ పాల్గొన్నారు.

వర్సిటీల పాలనను ప్రక్షాళన చేయాలి

కర్నూలు(అర్బన్), జూలై 9: యూనివర్సిటీల పాలనను ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో ఎస్ఎఫ్ఐ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని యూనివర్సిటీల్లోని ఉపకులపతులందరూ తమ పదవులకు రాజీనామా చేశారని, దాదాపు 15 రోజులుగా ఇన్‌చార్జి వీసీలను కూడా నియమించ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదోమ నివారణపై నిర్లక్ష్యం వద్దు

సి.బెళగల్, జూలై 9: పచ్చ దోమ నివారణపై నిర్లక్ష్యం వహించొద్దని వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని సి.బెళగల్, బ్యాథోలి, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఏవో వెంట సిద్దు, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

నేడు ఏపీ హంసా ఉద్యోగుల సమావేశం

కర్నూలు(హాస్పిటల్), జూలై 9: ఏపీ హంసా అసోసియేషన్ కర్నూలు సిటీ సర్వసభ్య సమావేశం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న సిటీ అధ్యక్షుడు టి.గోవిందు ఓ ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: నగర పాలక సంస్థ పరిధిలోని విష్ణుటౌన్ షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం కాలనీ వాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గోపాల్, సత్యనారాయణ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా కాలనీలో రోడ్లు సరిగ్గా లేక తాగునీరు సక్రమంగా రాక ముళ్ల కంపలు విషపురుగులు, దోమలతో సహవాసం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పద్మలత, విజయలక్ష్మి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరికి పూజలు

ఓర్వకల్లు, జూలై 9: ఓర్వకల్లులో వెలసిన సుంకులా పరమేశ్వరికి మంగళవారం ఆషాఢ మాసం పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలు, కూరగాయలతో అలంకరించారు. భక్తులు, మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. అనంతరం మహిళలు అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించారు.

బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్ల పరిశీలన



సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్ఐ

గూడూరు, జూలై 9: గూడూరు పట్టణంలోని ఎస్‌బీఐ, ఏపీజీబీ, కేడీసీసీ బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించినట్లు ఎస్ఐ హనుమంతయ్య మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయా బ్యాంకుల్లో మేనేజర్లను కలిసి బ్యాంకుల భద్రత ఏర్పాట్లపై చర్చించామన్నారు. ఆలారమ్ సిస్టమ్ ఎలా ఉంది, సీసీ కెమరాలు బాగా పని చేస్తున్నాయా వంటివి పరిశీలించామన్నారు.

రోగికి కోట్ల పరామర్శ



మాదయ్యను పరామర్శిస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 9: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరోసర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగి మాదయ్యను మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పరామర్శించారు. అనంతరం రోగికి అందుతున్న చికిత్స, సదుపాయాలను గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ ద్వారా ఆరా తీశారు. కార్యక్రమంలో న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామ్ బాలాజీ నాయక్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

సి.బెళగల్, జూలై 9: ప్రజల ఆరోగ్యంపై నిర్లక్షం వహించొద్దని వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంబదహల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కుటుంబంలోని అందరికీ వైద్య పరీక్షలు చేయాలని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు సూచించారు. ఈసమావేశంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 9: గృహనిర్మాణ సంస్థలో దీర్ఘకాలి కంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వామనగిరి హనుమన్న కోరారు. మంగళవారం కలెక్టర్‌ను తన చాంబర్‌లో సంఘం ప్రతినిధులు హనుమన్న, రామునాయక్ కలిసి సమస్యలను విన్నవించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మండల ఇన్‌చార్జి, సహాయ ఇంజనీరు పోస్టులకు భర్తీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సురేష్‌కుమార్, కె.వెంకటేష్, మధు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో మళ్లీ మంచి రోజులు

గూడూరు, జులై 9: ఉచిత ఇసుకతో భవన నిర్మాణ కార్మికులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మన్సన్ బాషా, జిల్లా బీసీ సెల్ నాయకుడు నాగప్ప యాదవ్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కురువ హనుమంతు అన్నారు. మంగళవారం గూడూరులో భవన నిర్మాణ కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పేదవాడికి ఇసుక ఉచితంగా లభిస్తుందన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు స్వాహా

కర్నూలు, జూలై 9: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తపేటకు చెందిన షేక్ ఖలీల్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.2.93 లక్షలు నగదు స్వాహా చేశారు. ఖలీల్ లారీ ఓనర్‌గా ఉంటున్నాడు. మంగళవారం తన మొబైల్ ఫోన్‌కు బ్యాంకు ఖాతా నుంచి రూ.2.93 లక్షల నగదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో అయోమయానికి గురైన బాధితుడు బ్యాంకుకు వెళ్లి విచారించాడు. తాను సైబర్ మోసానికి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 కేసులు నమోదు

నగరంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 13 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమో దు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తని ఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 ద్విచక్ర వాహనదారులు, రెండు ఆటో డ్రైవర్ల కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరురుస్తామని సీఐ తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



మంత్రి నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూలై 9: విజయవాడలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవెల్లిల్లో ఆయన స్వగృహంలో మంగళవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. కోడుమూరు నియోజకవర్గంలో ప్రధానంగా గురుకుల పాఠశాలలో చాలామంది పేద విద్యార్థులు చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారి ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని సీట్ల సంఖ్య పెంచాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. నారా లోకేశ్‌ను కలిసిన వారిలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రామలింగారెడ్డి ఉన్నారు.

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూలై 9: తెలుగుదేశం పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను కర్నూలు జిల్లాకు చెందిన నాయకులు కలిశారు. మంగళవారం ఉదయం విశాఖ పట్నంలోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌లు ఆయన్ను కలిసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ పట్నం టీడీపీ నాయకులు గోవింద్, శ్రీనివాసులు, అనంతపల్లె రామక్రిష్ణ రావు, రాంజీ పాల్గొన్నారు.

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: రజక వృత్తిదారులకు ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తబస్టాండు వద్ద ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రజక కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. లాండ్రీ వృత్తి నిర్వహణకు నెలకు 250 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఈ నెల 22న జరిగే శాసనసభ సమావేశాల్లో రజక కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాముడు, మద్దిలేటి, ఎల్లయ్య, వీరేష్ పాల్గొన్నారు.

మూసి నదిలా కేసీ కెనాల్: సీపీఐ



కేసీ కెనాల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 9: నగరంలోని కేసీ కెనాల్ డ్రైనేజీ నీటితో మూసి నదిగా మారిందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కే.జగన్నాథం ఆరోపించారు. మంగళవారం సీపీఐ బృందం మురుగు కాలువలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ కేసీ కెనాల్‌లోని నీరు కంపుకొడుతుందన్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైనేజీల నీళ్లు కేసి కెనాల్‌లో మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనీరు తాగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నగరంలో విపరీతంగా దోమల బెడద పెరిగిందని తక్షణమే కేసి కెనాల్‌ను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు మహేష్, డి.శ్రీనివాసరావు, నాగరాజు, ఈశ్వర్, బీసన్న, పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే పీఆర్‌వోగా శ్రీధర్



కర్నూలు(రూరల్), జూలై 9: దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా ఎ.శ్రీధర్ నియమితులయ్యారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ రాకేష్ దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ అధికారి(ట్రాఫిక్, ఆర్‌పీఎఫ్)గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీధర్‌ను నియమించారు. ఈయన 2011 బ్యాచ్‌కి చెందిన వారు. గతంలో ఐఆర్‌టీఎస్, డిప్యూటీ జనరల్ మేనేజర్(జనరల్)గా పనిచేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఆర్ఐ, ప్రిన్సిపాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 9: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీచైతన్య పాఠశాల ఆర్ఐ రామాంజనేయులు అన్నారు. కర్నూలు కే-4 బ్రాంచ్ పాఠశాల విద్యార్థులతో క్లీన్ అండ్ గ్రీన్ గురించి ర్యాలీ చేయించి పర్యావరణ గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుహాసిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీ పుట్టిన రోజులకు ఒక మొక్కను నాటితే చాలు అని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీన్ హుశేన్‌బాషా, ఉపాధ్యాయులు ప్రతిభ, నాగలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

లివర్ ట్రాన్స్‌ప్లాంట్ క్లినిక్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ శశివర్దన్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 9: ఆర్క హాస్పిటల్, హైదరాబాదు గ్లెనీగల్స్ హాస్పిటల్స్ సంయుక్తంగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు కర్నూలు ఆర్క హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.శశివర్దన్ రెడ్డి, సీవోవో శ్రీనివాస్ తంబే వెల్లడించారు. మంగళవారం నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని ఆర్క హాస్పిటల్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరు నెలల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటును పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఆర్క హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ పాటిల్ అమలరెడ్డి, లీవర్ ట్రాన్స్‌ప్లాంటు నిపు ణులు డాక్టర్ చందన్ కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ రితేష్ రెడ్డి పాల్గొన్నారు.

వేతనాల కోసం కూలీల ఆగ్రహం

● ఎంపీడీవో కార్యాలయం ముట్టడి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న కూలీలు

హాలహర్వి, జూలై 9: రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం వేతనాలు అందక పోవడంతో కూలీలు ఆగ్రహించారు. మంగళవారం సీపీఐ అధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఉపాధి కరువై ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి పనులకు వెళితే వేతనాలు రాకపోవడంతో జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మునిస్వామి, రైతులు ప్రకాష్ పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల సీఆర్టీల సర్వీసులు రెన్యూవల్

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఆలూరు, జూలై 9: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల సర్వీసులు రెన్యువల్ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ జారీ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సీఆర్టీలు విధులు బహిష్కరించి నారా లోకేశ్‌కు సమస్యను విన్నవించారు. స్పందించిన మంత్రి తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1,284 మంది సీఆర్టీల సర్వీసులను రెన్యువల్ చేస్తూ రాష్ట్ర గిరిజన విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే జీవో ఆర్‌టీ నెంబర్ 97ను జారీ చేశారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 74 మంది సీఆర్టీలు తిరిగి విధుల్లో చేరారు. సర్వీసులను రెన్యువల్ చేసినందుకు గాను నారా లోకేశ్‌కు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఎస్ ఆర్‌టీసీ స్థలం టెండర్లకు ఆహ్వానం

వెల్దుర్తి, జూలై,9 : వెల్దుర్తి ఏపీఎస్ఆర్‌టీసీ కొత్తబస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలం 4501(0.93) చదరపు అడుగులు 15 సంవత్సరాలపాటు అద్దెప్రాతిపదికన వ్యాపారాలు నిర్వహించేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. మంగళవారం ఏపీఎస్ఆర్‌టీసీ సిబ్బందితో కలిసి కొత్తబస్టాండ్ పరిసరాలను, ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 2వ తేదీ నుంచే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని, 16వ తేదీ సాయంత్రం 5గంటలకు టెండర్ల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. 10వ తేదీ జోన్ డిపోలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

రాతనచెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తుగ్గలి, జూలై 9: గుర్తు తెలియని వ్యక్తి రాతన చెరువులో పడి మృతి చెందినట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు. మంగళవారం తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు 45 ఏళ్ల పైబడిన వ్యక్తి బహిర్భూమికి వెళ్లి రాతన చెరువులో కాలు జారీ ఎడి మృతి చెందాడని, స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

● 4 తులాల బంగారం, 36 తులాల వెండి, నగదు దోచుకెళ్లిన దుండగులు

ఆదోని, జూలై 9: ఆదోని పట్టణంలోని కల్లుబావి ప్రాంతంలో తాళం వేసిన ఇంటికి సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్న రామాంజనేయులు, సుపుత్రమ్మ దంపతులు సోమవారం ఉదయం తమ ఇంటికి తాళం వేసుకుని కౌతాళం మండలం, ఉప్పరహాల్ గ్రామంలో నివాసముంటున్న తమ బంధువులు ఇంటికి వెళ్లారు. వీరు వెళ్లిన రోజు అర్ధరాత్రి ఇంటికి ఉన్న తాళాలను పగలగొట్టి లోపలకి చొరబడ్డారు. తమ ఇంటి పక్కన ఉన్నవారు ఉదయం లేచి ఇంటికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి, బాధితులైన రామాంజనేయులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. బాధితులు ఇంటికొచ్చి చూడగా బీరువాలోని 4 తులాల బంగారు. ఆభరణాలతో పాటు, 36 తూలాల వెండి, రూ.15 నగదు దోచుకెళ్ళినట్లు గుర్తించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 9: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదోని పట్టణంలో కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘ జెండాను ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహాయ కార్యదర్శి రాజశేఖర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా స్వామి వివేకానంద స్ఫూర్తితో పనిచేస్తుందని, విద్యారంగ సమస్యలే కాకుండా సామాజిక కార్యక్రమాల్లోనూ ఏబీవీపీ ముందుంటుందని పేర్కొన్నారు. నాయకులు ఉమా మహేష్, వీరేష్, గోవిందు, బండ ముఖేష్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 9: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్, ఆదోని అధ్యక్షుడు రషీద్ డిమాండ్ చేశారు. మంగళవారం తుంగభద్ర దిగువ కాలువ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ గవర్నర్‌ను కలిసి విన్నవించామన్నా కారణంతో ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని పేర్కొన్నారు. అందుకే వైసీపీ ప్రభుత్వానికి ఉద్యోగులంతా గుణపాఠం చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం తమ నేతపై ఉన్న అక్రమ కేసును ఎత్తివేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగ, రవి, ఎల్లయ్య ఇందిరా జోరతి, రాధాకృష్ణ, వేణు, చెన్నయ్య పాల్గొన్నారు.

వసతులులేని డిగ్రీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూలై 9: ఎమ్మిగనూరులో కనీస వసతులు లేకుండా నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ, పీఎస్‌యూ, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంఘాల నాయకులు ఉదయ్ కుమార్, సురేష్, శేఖర్ నాయుడులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులో రాయసీమ యునివర్శిటి ఇన్‌చార్జీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మిగనూరులో కొన్నేళ్లుగా కళాశాలలు రేకుల షెడ్లలోను, అద్దెభవనాలు, కాంప్లెక్స్‌ల్లో నడుపుతున్నారని తెలిపారు. యూనివర్శిటి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



ఎమ్మిగనూరు, జూలై 9: సెబ్ ఎమ్మిగనూరు స్టేషన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన మద్యంను మంగళవారం సెబ్ అధికారులు ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్ మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ అధ్వర్యంలో 83కేసుల్లో పట్టుబడ్డ 535 లీటర్ల మద్యం సీసాలు, పాకెట్లను వెంకటగిరిరోడ్డులో వాహనాలతో ధ్వంసం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మద్యంను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు రాజకీయ గ్రహణం

● 5 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
● ఆదాయం కోల్పోతున్న గ్రామపంచాయితి



ప్రారంభానికి నోచుకోని సంతమార్కెట్‌లోని షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు, జూలై 9: రాజకీయ గ్రహణంతో ఐదేళ్ల క్రితం అర్బన్ నిధులు రూ.1.20 లక్షలతో ఆలూరు పట్టణం సంత మార్కెట్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రామ పంచాయతీ ఆదాయాన్ని కోల్పోతోంది.

● ప్రారంభానికి అడ్డంకులు..

సంత మార్కెట్‌లో మొత్తం 29 దుకాణాలు నిర్మించారు. వాటికి గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ ఆధికారు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వైసీపీ నాయకులకు, టీజీపీ సర్పంచు అరుణదేవి సోదరుడు బెంగళూర్ కిషోర్‌కు మధ్య కుదిరిన ఒప్పందం బేడిసి కొట్టడంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తి పంచాయతీ వేలాలు వాయిదా పడ్డాయి. అప్పటి నుంచి ఆ దుకాణాలకు వేలాలు వేసేందుకు అధికారులు సాహసించడం లేదు.

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన సముదాయం

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఆరంభానికి నోచుకోకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది.

● దుకాణాలకు డిమాండ్

ఆలూరు పట్టణం మీదుగా జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో రోడ్ సైడ్ దుకాణాలు తొలగించారు. దీంతో సంతమార్కెట్లో నిర్మించిన దుకాణాలకు డిమాండ్ పెరిగింది.

● టీడీపీ ప్రభుత్వం పై చిరు వ్యాపారుల ఆశలు

ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు కేటాయిస్తే వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించవచ్చని చిరు వ్యాపారులు భావిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం అవుతుందని చిరు వ్యాపారులు, నిరుద్యోగులు ఆశతో ఉన్నారు. పాలకులు, అధికారులు దృష్టి సారించి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి చొరవ చూపాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

పూజారి, గ్రామస్థుల మధ్య వివాదం

● గార్లదిన్నెలో పొలందున్నే ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామ మహిళలు



పొలం దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామ మహిళలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 9: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో ఆంజ నేయస్వామి పూజారి, గ్రామస్థుల మధ్య వివాదం చోటు చేసుకుంది. స్థానికులు, పూజారి తెలిపిన వివరాల మేరకు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి సంబంధించి సర్వేనెంబర్ ఏ37లో 8.97 ఎకరాల భూమి ఉంది. దేవదాయశాఖ అధికారులు పూజారి రాజప్పకు గ్రామంలో ఉన్న మాన్యం(దేవదాయభూమి) భూమిని సాగుచేసుకొని దేవుడికి పూజలు చేయాలని తెలుపుతూ అనుమతులు ఇచ్చిందని పూజారి రాజప్ప చెబుతున్నారు. అయితే, గ్రామస్థులు మాత్రం దేవాలయ అభివృద్ధి కోసం కొన్నేళ్ల గ్రామంలోని దేవాలయ భూమిని కౌలుకు ఇచ్చి ఆ నిధులతో దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు పూజారి రాజప్పతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. కాగా పూజారి రాజప్ప మాన్యం భూమిని తాను సాగుచేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని మంగళవారం ట్రాక్టర్‌తో భూమిని దున్నేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామ మహిళలు మాన్యం భూమిని దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి పోలీసులను పంపి వివాదాన్ని సద్దుమనిగించారు.

బడికి తాళం వేసిన గ్రామస్థులు

● ఉపాధ్యాయులను నియమించాలంటూ తల్లిదండ్రుల డిమాండ్



కందనాతి పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 9: గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. గ్రామంలోని పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 95 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. అయితే, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని దీంతో విద్యార్థులు సరిగా చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు అంతమంది పిల్లలకు పాఠాలు బోధించలేకపోతున్నారన్నారు. చదువుచెప్పే గురువులే లేకపోతే విద్యార్థులు ఏమి చదువుకుంటారని ప్రశ్నించారు. తమ పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను నియమించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై స్థానిక ప్రధానోపాధ్యాయులు సురేష్‌ను వివరణ కోరగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, మొత్తం 95 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఇక్కడ తనతో పాటు మరో ఉపాధ్యాయురాలు పనిచేస్తుండేదని ఆమె ఇన్‌సర్వీస్ లివ్‌లో వెళ్లిందన్నారు. దీంతో తాను ఒక్కడినే విద్యార్థులకు విద్యబోధించడంతో పాటు పాఠశాలలోని రికార్డు పనులను చూసుకోవాల్సి వస్తోందని తెలిపారు.

మైనర్ మీడియాలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ

హొళగుంద, జూలై 9: స్థానిక పాఠశాలలో కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల్లో సీబీఎస్సీ ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష రాయడానికి బదులుగా కన్నడ భాషలో రాసేందుకు అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీ హృదయరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడతూ నాలుగు మీడియంలుగా ఉన్న హొళగుంద పాఠశాలలో ఇద్దరు హెడ్ మాస్టర్లను నియమించాలని, ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్, కన్నడ మీడియంలను ప్రత్యేకంగా వేర్వేరుగా చూపుతూ పోస్టులను మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు.

పంచాయితీ వేలం పాటలు వాయిదా

హొళగుంద, జూలై 9: వారపు సంత మార్కెట్, బస్టాండ్, కమేళా, సుజల స్రవంతికి నిర్వహించిన వేలంపాటలు వాయిదా వేసినట్లు ఈవోఆర్పీడీ చంద్రమౌళీశ్వర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ తెలిపారు. మంగళవారం వారు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వేలంపాటదారులు పాడకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రిలో అన్నిసేవలు అందుబాటులోకి తెస్తాం : ఎమ్మెల్యే కేఈ



గర్భిణులకు భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ,జూలై 9: పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిప్రజలకు మంచివైద్యసేవలు అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. వైద్యవిధాన పరిషత్ నిధులతో ఆసుపత్రి ఆవరణలో రోగులకోసం ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రి ఉండాల్సిన సిబ్బందికంటే తక్కువగాఉన్నారని, ఆపరేషన్ థియేటర్‌లో అన్ని సదుపాయాలు ఉన్నా సర్జన్‌లేరని పేర్కొన్నారు. వైద్యవిధానపరిషత్ అధికారులతో మాట్లాడి ఆసుపత్రి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిని వెంకట్రాముడు, మనోహర్‌చౌదరి, లోక్‌నాథ్, వెంకటపతి, శివరాముడు, గుడిసెనరసింహులు తదితరులుపాల్గొన్నారు.

అలాగే పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రతినెల 9వ తేదీ దూరప్రాంతాల నుంచి ఉచితస్కానింగ్‌కు వచ్చే గర్భిణులకు టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజనసౌకర్యాన్ని ఎమ్మెల్యే కేఈశ్యాంబాబు ప్రారంభించారు.

నిషేధిత సమయాల్లో చేపలుపడితే చర్యలు : డీఈ



చేపలుపట్టేవారి కౌన్సెలింగ్ ఇస్తున్న ఫిషరిష్ డీఈ

పత్తికొండ, జూలై 9: నిషేధిత సమయాల్లో చేపలుపడితే చర్యలు తప్పవని ఫిషరిష్ డీఈ చంద్రయ్య హెచ్చరించారు. మంగళవారం పందికోన రిజర్వాయర్ వద్దచేపలు పట్టేప్రాంతాన్ని ఆయన తనిఖీచేశారు. చేపలు పట్టేందుకు గుడిసెలువేసుకొని జీవిస్తున్న కుటుంబాలకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. చేపలు సంతానోత్పత్తిని జూలై, ఆగస్టు నెలల్లో చేస్తాయని, ఆనెలల్లోచేపలవేట నిషిద్ధమని ప్రభుత్వచట్టమేచేసిందని పేర్కొన్నారు. పందికోన రిజర్వాయర్‌లో చేపలవేటకోసం ఇచ్చిన సమయం జూన్30న ముగిసిందని, ఈ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్లాలని సూచించారు.

16న మార్కెట్‌ల వేలాలు

ఆదోని టౌన్, జూలై 9: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత, గొర్రెల సంతలకు ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన సుంకం వసూలు చేయడం కోసం ఈనెల 16న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలాలను వేయనున్నట్లు కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, గత నెల 27వ తేదీన నిర్వహించాల్సిన ఈ వేలాలు అనివార్య కారణాలతో వాయిదా పడిందని, వేలం పాటదారులు ఈనెల 16వ తేదీన జరిగే బహిరంగ వేలాల్లో పాల్గొనాలని కోరారు.

గోనెగండ్ల సర్కిల్ అభివృద్ధికి చర్యలు

ఎమ్మిగనూరు, జూలై 9: పట్టణంలోని గోనేగండ్ల సర్కిల్‌ను అభివృద్ధి చేసేందుకు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాలతో మంగళవారం పట్టణంలోని గోనేగండ్ల సర్కిల్‌ను మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు డీఈ నీరజ, టీపీఓ గోపాలకృష్ణ, ఏఈ మదన్, ఆర్అండ్‌బీ ఏఈఈ విజయ్ నరేష్, సూపర్‌వైజర్ ప్రభులు పరిశీలించారు. ఇటీవల పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసినట్లుగానే ఐలవ్ ఎమ్మిగనూరు బోర్డు ఏర్పాటు చేయటంతో పాటు నాలుగు రోడ్లకు సింహాల బొమ్మలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

రోడ్లకు నిధులు మంజూరు చేయాలి



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన మాజీ జెడ్పీటీసీ మీనాక్షినాయుడు

చిప్పగిరి, జూలై 9: మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని జడ్పీటీసీల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోరారు. మంగళవారం అవుకులో జరిగిన సమావేశంలో మంత్రిని చిప్పగిరి టీడీపీ మండలం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు చింతకుంట నుంచి ఏరూరు, చిప్పగిరి మీదుగా మద్దికెరకు రోడ్డు నిర్మించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ నరసింహులు, టీడీపీ నాయకులు హరి, సంగమేష్ గౌడ్ పాల్గొన్నారు.

డీఎస్సీపై మొదటి సంతకం హర్షణీయం

కోసిగి, జూలై 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేయడం హర్షించదగ్గ విషయమని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరె కృష్ణ అన్నారు. మంగళవారం కోసిగి మండల పరిధిలోని పల్లెపాడు, చింతకుంట, దుద్ది, కందుకూరు, ఆర్లబండ పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గంగాదర్, రామన్న, మండల నాయకులు వెంకటలక్ష్మి, ఖాజాబందే పాల్గొన్నారు.

ముగతిలో జగన్నాథ రథయాత్ర



ముగతిలో జగన్నాథ్‌ను ఊరేగిస్తున్న భక్తులు

నందవరం, జూలై 9: ముగతిలో జగన్నాథ రథ యాత్రను అంత ర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముగతిలోని ఇస్కాన్ దేవాలయం నుంచి ఎమ్మిగనూరు వరకు పాదయాత్రగా భక్తులు ఊరేగించారు. జై జగన్నాథా... జైజై జగన్నాథా... హరేకృష్ణ... హరేరామా అంటూ పాటలు పాడుతూ ఊరేగారు. ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి నందబలరామ్ స్వామి, సాంబయ్య, సోమేష్‌స్వామి, వీరన్న, మెడికల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీ మఠానికి రూ.8.38 లక్షలు విరాళం

మంత్రాలయం, జూలై 9 : రాఘవేంద్రస్వామి మఠానికి భక్తులు రూ.8.38 లక్షల విరాళం అందజేసినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు తెలిపారు. ఏపీలోని రామచంద్రపురానికి చెందిన ఇద్దరు భక్తులు బీఎస్ రావు రూ.3 లక్షలు అన్నదానంకు, శ్రీనివాసరావు రూ.2లక్షలు అన్నదానం, రూ.50వేలు గోసంరక్షణకు, నెల్లూరుకు చెందిన ఆనంద్ మోహన్‌రెడ్డి రూ.లక్ష , బెంగుళూరుకు చెందిన ఇద్దరుభక్తులు డాక్టర్ మంజునాథ్‌రూ.లక్ష, రూ.38 వేలు విద్యాదానం, యజునందన్ రెడ్డి రూ.50వేలు అన్నదానంకు మొత్తం 5 మంది భక్తులు రూ.8.38 విరాళాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ పేదలకు వరం

టీడీపీ నేతల హర్షం

ఆదోని/ మంత్రాలయం/ ఆలూరు/ నందవరం, జూలై 9: ఉచిత ఇసుక పేదలకు వరం లాంటిదని టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు, ఆలూరు,మంత్రాలయం నాయకులు వీరభద్రగౌడ్, రాఘవేంద్రరెడ్డి వేర్వేరుగా మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక రూపంలో పేదలను జలగల్లా పీక్కుతినిందని ఆవేదన వ్యక్తం చేశారు, భవన కార్మికులు, ఇళ్లకట్టుకునేవారు లక్షలకు క్షలు డబ్బులు పెట్టలేక చాలా ఇబ్బందిపడ్డారన్నారు. ఇప్పుడు అందరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర ప్రభుత్వ రీచ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గృహాలు నిర్మించుకునే వారికి వంకలు, వాగులు, చిన్న పాటి నదుల వద్ద ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను ఉచితంగా రవాణా చేసుకోవచ్చని తెలిపారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి, జూలై 9: వాతావరణ మార్పు, పరిసరాల ప్రభావం వల్ల వచ్చే డయేరియా వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా సర్వేలెన్స్ టీమ్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం రాతన ఆశ్రమ పాఠశాల, తుగ్గలి కేజీబీవీ పాఠశాలతో పాటు రాంపల్లిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల మందు స్ప్రే చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి ట్యాంకులను శుభ్రం చేశారు. అలాగే డయేరియా బారిన పడకుండా ఉండేందుకు విద్యార్థులకు, గ్రామస్థులకు సలహాలు, సూచనలు చేశారు. వైద్యులు ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

పత్తికొండ టౌన్, జూలై 9: ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్టీయూ పోరాటాలు చేస్తుందని జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కుంపటి నారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను ఎస్టీయూ బృందం నాయకులు సందర్శించి ఉపాధ్యాయుల చేత సభ్యత్వ కార్యక్రమాన్ని నమోదు చేయించారు. కార్యక్రమంలో ఎస్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, బలరాముడు, ఆర్థిక కార్యదర్శి మారుతి, నాయకులు భీరప్ప, చెన్నకేశవరావు, వుశేన్, వెంకటేశ్వర్లు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

14న ఉచిత సంతాన చికిత్స శిబిరం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 9: ఈ నెల 14న పట్టణంలోని సాష తల్లి బిడ్డల నర్సింగ్ హోమ్‌లో ఉచిత సంతాన సాఫల్యత చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నర్సింగ్ అధినేత డాక్టర్ మల్లెపోగు కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నేడు చాలామంది దంపతుల్లో ఇన్-ఫెర్టిలిటీ సమస్యతో బాధపడుతున్నారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఆహార అలవాట్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంతానం లేక ఇబ్బందులు పడుతున్న దంపతుల కోసం తమ నర్సింగ్ ద్వారా ఉచిత ఓపీ, స్కానింగ్‌తో పాటు, పలు రకాల పరీక్షలపై రాయితీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సీఆర్ రేష్మ దంపతులకు చికిత్స అందిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్లెల్సీ కాలువలోని చెత్తను తొలగించాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 9: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో చెత్తను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి ఎల్లెల్సీ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువ నీటినే పట్టణంలోని తాగునీటి కోసం మళ్లిస్తారని పేర్కొన్నారు. కాలువలో చెత్త చెదారం నిండుకుపోయి మురికి కూపంగా మారిందని శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బజారి, కేసీ జబ్బార్, తిమ్మగురుడు, వీరేష్, విజయేంద్ర, మల్లికార్జునగౌడు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

పత్తికొండ టౌన్, జూలై 9: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న నెలల తరబడి ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్, మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అధికారులకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ మండలంలో ఆరు వారాలుగా చేసిన పనులకు ఉపాధి బిల్లులు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పనుల కూలీలకు రోజుకు రూ.600లు వేతనం, 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

మద్దికెర, జూలై 9: బొమ్మనపల్లి గ్రామంలో ఈ నెల 11వ తేదీన పెంకులింటి అనిత జ్ఞాపకార్థకంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచు బొమ్మనపల్లి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వైద్యులు పి.శ్రీహరి, మురహరి ఆధ్వర్యంలో మండలంలోని ప్రజలకు గుండె వ్యాధి సంబంధిత పరీక్షలు, ఈసీజీ టెస్టు, బీపీ, షుగర్, ఎముక సాంద్రత పరీక్ష, ఆక్సిజన్ పరీక్ష వంటి వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక బకాయిల పై శ్వేతపత్రం ప్రకటించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 9: గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్‌లకు రావాల్సిన ఆర్థిక బాకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ జాన్ విక్టర్ కోరారు. మంగళవారం నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేసి తమకు రావాల్సిన బకాయిలను పెండింగ్ పెట్టిందన్నారు. కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం వెంటనే అన్ని బకాయిలను చెల్లించాలని కోరారు.

నామినేటెడ్ పోస్టులను కేటాయించాలి

ఆదోని టౌన్, జూలై 9: దేవాలయాలకు సంబంధించిన పాలక మండలల్లో నామినేటెడ్ పోస్టులను కేటాయించాలని జంగమ, వీరశైవ పోరాట హక్కుల సమితి నాయకులు యడవల్లి మంజునాథ్ స్వామి, ఎండీ భద్రీనాథ్ స్వామి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జంగమ వీరశైవులు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలన రావడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. నామినేటెడ్ పోస్టులను కేటాయించాలని సీఎంకు లేఖ రాశామని పేర్కొన్నారు. శివరాజు, జేపీ మల్లికార్జున పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుతో అధిక దిగుబడులు సాధ్యం

దేవనకొండ ,జూలై 9 : పండ్లతోటల సాగుతోనే అధిక దిగుబడులు సాధ్యమని సేర్టీస్ ప్రోగ్రాం మేనేజరు నారాయణ అన్నారు.మండలంలోని కప్పట్రాళ్లలో తానా శ్రీశక్తి భవనంలో సేర్టీస్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఎస్పీ ఆకే రవికృష్ణ గారి ఆదేశాల మేరకు హర్టికల్చర్ హబ్‌గా కప్పట్రాళ్లని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రైతులను పండ్లతోటల వైపు ప్రోత్సాహిస్తున్నట్లు పేర్కొన్నారు.